# తమసః పరస్తాత్

మనసు ఏమీ బాగుండలేదు – మబ్బువేస్తే బాగుండును అనుకున్నాను: ఫెళ్ళుమంది వెన్నెల...

కళ్ళు కుట్టుతున్నాయి: కంకంటి పాపరాజును కప్పుకున్నాను...నందనవనంలో, పదితలలరాయడు కోడై కొక్కిరించాడు...

...ఎన్నడో మరిచిపోదామనుకున్న...పాడుకథ..నిలవేసి వెక్కిరించడం మొదలుపెట్టు తూంది: కక్కేస్తాను.

– చిన్నది...

...పదిహేడేళ్ళది...

ఆ ఊరూ, అలదానిపేరూ, మీకు అనవసరం లెద్దురూ...

అవాళ...ఇవాళ వెన్నెలే:

––అక్కడ అన్నాళ్ళుగా ఉంటున్నందుకు...తిన్న తిండి బాగా వంటపట్టింది.

...ఉన్నవాడిని ఊరుకోకుండా, నిన్న కనుచీకటివేళ ఆలా కులుకుతూ పోతూంటే... చూశాను.

ఇవాళ ఉదయం, మసక – మసకలో, తెల – తెలవారుతూండగా, ఇటే, నక్కి – నలిగిరావడం... చూశాను.

తిరిగి – తిరిగి చూశాను.

మళ్ళీ నిన్నటివేళకు కాపువేశాను...నిలవేశాను...

ఒక్కనిమిషం...యుగమై నిశ్శబ్దం...

"ఎవడీ సైతాన్?" అనుకుంటున్నాయి, ఆ కనుకొలుకులు...

..."ఎందు కంత హైరాను, భాయీ?" అంటున్నాడు గజగజలాడే మనలో కామయ్య...

గాజులు పప్పై – పప్పై కంకణ రేకలు జేగురుంచినవి...

...మబ్బేస్తే ఎంత బాగుండును, అని మనసులో అనుకుందామనుకుంటూండగానే, వెన్నెల మరింత దుమ్మెత్తి పోస్తూంది...

ఎవరో వస్తూన్నట్టుంది...

"ఎవరు వారు?...ఎవ రక్కడ?"

...ఓస్...ఎవరో అనుకుంటిని: ఆ వచ్చేది, రాఘవయ్య. ప్రతిరోజూ, తెల్లవారుజామున, ఆ భక్తుడి గొంతుకలో, మా వీధి పొడుగునా. కృష్ణకర్ణామృతశ్లోకాలు శోకిస్తాయి.

––మాట అనుకోలేదు; పాటకదా పోనీ మనకెందుకు అనుకున్నాను.

రాఘవయ్య – తనకెందుకూ అనుకోలేదు. గొంతు, మరింత చేరువలో చప్పుడు చేశాడు.

అతి – మామూలీ కాముకుడిలాగా ఖంగారుపడి, పట్టు వదిలేశాను...కాని,

పిట్ట ఎగిరిపోలేదు; రాఘవయ్య గొణుగుడుగా దేవుడితో మొరపెట్టుకుంటూ, తనదారిని తాను పోయినాడు.

నేను స్తంభించిపోయినానా?

..నీడలు రెండు, ఎంతసేపటికీ, ఇంకా విడి – విడిగానే ఉన్నాయి. 'అన్నాయ్, నీకిది తగదుసుమా!'... అంటుందేమో, 'అయితే చచ్చాముగా దేముడా'...అనుకుంటూ పంచప్రాణాలూ...చావుబ్రతుకుల్లో ఉన్నవి.

ఆ చిన్నదానికి నదురూ – బెదురూ లేదు; కాని, చెయ్యన్నా చేసుకోలేదు.

పోనీ తిట్లన్నా నోటికి రావా?– ఊరూనాడూ హడలేట్టు కేకలువెయ్యలేదా? – సందుదొరికిందే చాలునని, పారిపోలేదా? – ఏమీ చెయ్యలేదు...అలాగే, అక్కడే తన్ను కాదన్నట్టుగా, నిలుచుంది...

ఎంతసేపు, అలా నిలుచోడం? – కాళ్ళు మనస్సులో పరుగెత్తుతూన్నవి; కాని ఒళ్ళు మొద్దుబారిపోయి ఝల్ మనడానికన్నా జవలేకుండాపోయింది...

ఈ పిల్లాడూ అలాగే నిలుచున్నాడు...

ఎవరు వచ్చేది...రాఘవయ్యేనా?...

"అయితే మానెనెలే!" అని హెచ్చరించింది మనస్సు: అక్కడే నిలవేసింది...

ఎవరు వచ్చేది...రాఘవయ్యలాగా లేడే ...గొంతులో మోగే సడీ సద్దూ వినబడడంలేదే?

...గాజులు తళుక్కుమన్నవి కాని, గల – గల – చలాకీ లేదు. చీరె అంచు ఉత్తరీయపు మగసిరితో మీసం దువ్వుతూంది...చీరెకుచ్చెళ్ళు, కాళ్ళకు బంధాలుపడటం లేదే...

ఎవరావచ్చేది?...వస్తూన్నది...రామయ్య అన్నకూతురు కాదూ?...

వెన్నెలనీడను ఒళ్ళువిరుచుకుంటూన్న చీకట్లోకి... కొండి ఎత్తుకున్న తేలులాగా చర – చరా ప్రాకివచ్చింది... గడ్డకట్టుకుపోయిన పదిహేడేళ్ళు ...ఆ కంఠానికి పెనవేసుకుపోయినవి...ఆ కౌగిలింతలో రంగరించుకుపోయినవి...

నేలమీద విడి – విడి నీడ పడకుండా, ఆ అడుగులలో అడుగు ఒదిగి...కళ్ళపొలిమేరలు దాటి... ఉయ్యాలలూగిపోయింది...

ఆకాశంలో ఎవతో దేవకన్నె నిట్టూర్చింది.. ఆపైన ఎవతో ప్రౌఢ ఉసూరు మంది...యింకా ఆపైన ఎక్కడో చుక్కల్లో ప్రొద్దుపొడిచింది...వెన్నెల నలిగి వసివాడి పోయింది...వీధి...రోషంతో నన్ను ఇంట్లోకి విసిరేసింది...

ఆవాళ, ఏవేళకూ తెలతెలవారలేదు...ప్రొద్దునిద్దురలేవలేదు....

మంచులో కణకణలాడిపోతూ మందారగుమ్మ... మరియాదగా ఆకుల్లో అణగీ అణగిపడివున్న, జాజిమొగ్గమీదికి రసభారంతో వాలింది...వాలేపట్టుకు ఝుంమ్మన వెదుక్కుంటూన్న తుమ్మెద. తుమ్మెద తోకముడుచుకు పారిబోబోతూంటే మల్లెతీగకు కొట్టుకొని తల బొప్పికట్టింది...

ప్రకృతి ఒక్కొక్కనాడు, ఒళ్ళుపొగరెక్కి ఒకటో తరగతి వాచకంలాగా...అతి తేలికపాఠాలు చదువుతుంది. మనమందరమూ శుంఠలమనుకుని...ఎంతసేపటి నుంచో...ఎందుకో కిటికీదగ్గర నిలుచున్నాను...సప్తద్వీపాల్లో, అలాగే, నాలాగే ఎందరునిలుచున్నారో, ఆవేళప్పుడు.. అర్థంలేకుండా.

ఎండతోబాటు, చరచరా నవ్వువచ్చింది...చిన్నప్పుడు దిద్దిన ఓనమాలై...ఆ కథ...ఖజానాలో పడిపోయింది...

--ఆ అమ్మాయి రోజా అదేవేళకు అలాగే నలిగి...నడచిపోతూండేదా? ఏమో!...ఎన్నాళ్ళనాటి ముచ్చటో...ఇప్పుడు--

--కంకంటి పాపరాజు, గభాలున క్రిందికి దొర్లి, బారసాచుకు ఆవులించాడు... వెన్నుచరిచి...లేని దుమ్ము దులిపి...'ఆ మూల అణగీ మణగీ పరుండు బాబూ' అని బలవంతంగా బుజ్జగించాను...

...మనసు, మరీ అసహ్యంగా...కందింది.

★ ★ ★